ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
బుధవారం
10 డిసెంబర్ 2025

ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలి:సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి శాఖ చేసిన పనులన్నీ తన వద్ద రికార్డు రూపంలో ఉన్నాయని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఎండీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

"అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చాం. ఆ జిల్లాలో కరవు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించాం. రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేది. అనంతపురం జిల్లాలో నాణ్యమైన వేరుశనగ పండేలా చర్యలు చేపట్టాం. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టాం. రాయలసీమలో ఇప్పుడు భూగర్భజలాలు పైకి వచ్చాయి. భూగర్భజలాలు 3 మీటర్లకు చేరితే ఖర్చుపెట్టే బడ్జెట్ తగ్గుతుంది. సౌరశక్తి వినియోగించుకుంటే విద్యుత్ డిమాండ్ బాగా తగ్గుతుంది. ఈ ఏడాది కరెంట్ ఛార్జీలు పెంచం. దేశంలో ఇండస్ట్రియల్ పార్కులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మనదే" అని చంద్రబాబు అన్నారు.

మీ డబ్బు.. మీ హక్కు: క్లెయిమ్ చేయని ఆస్తులపై ప్రధాని మోదీ పోస్ట్

డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం లింక్డిన్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. 'మీ డబ్బు.. మీ హక్కు' అని పేర్కొన్నారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్సైట్లను ఆయన పంచుకున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో కారు బోల్తా.. ముగ్గురి మృతి

జైనథ్, డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది.

ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

నోబెల్ పురస్కార ప్రదానోత్సవానికి శాంతి బహుమతి విజేత గైర్హాజరు



డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఈ ఏడాది ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. నేడు నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది. అయితే ఈ కార్యక్రమానికి ముందు నార్వే రాజధాని ఓస్లోలో నిర్వహించే మీడియా సమావేశానికి శాంతి బహుమతి విజేత మరియా కొరీనా గైర్హాజరు అయినట్లు తెలుస్తోంది. దీంతో నిర్వాహకులు మీడియా సమావేశాన్ని రద్దు చేశారు.

కాగా అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని ఇప్పటికే వెనెజువెలా అటార్నీ జనరల్ వెల్లడించిన నేపథ్యంలో.. నోబెల్ బహుమతి అందుకోవడానికి ఆమె వస్తారా, లేదా అనే సందేహాలు నెలకొంటున్నాయి. అవార్డు అందుకోవడానికి మరియా ఓస్లోకు వెళ్తుందో, లేదో తమకు తెలియదని వెనెజువెలా మంత్రి డియోస్డాడో కాబెల్లో పేర్కొన్నారు. నోబెల్ బహుమతి అందుకోవడానికి మరియా హాజరవుతారని ఆశిస్తున్నట్లు నిర్వాహకులు అశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఆమె దేశం విడిచి బయటకు వెళ్తే మళ్లీ వెనెజువెలాకు తిరిగివచ్చే అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. మరియా మాజీ ప్రచార నిర్వాహకురాలు మగళ్లి మెడా మీడియాతో మాట్లాడుతూ ఆమె బయటకు వెళ్లినప్పటికీ కచ్చితంగా స్వదేశానికి తిరిగొస్తారని పేర్కొన్నారు. నార్వే రాజధాని ఓస్లోలోని ఓస్లో సిటీ హాల్లో నేటి మధ్యాహ్నం 1:00 గంటకు నోబెల్ ప్రదానోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మరియా కుటుంబసభ్యులు ఇప్పటికే ఓస్లోకు చేరుకున్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ సహా అనేకమంది లాటిన్ అమెరికా నేతలు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవనున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

వెంకటేశ్ - త్రివిక్రమ్ సినిమా టైటిలిదే..

అప్డేట్ పంచుకున్న టీమ్

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్ను ఖరారు చేశారు. 'హౌస్ నం47' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ నేడు ఈ టైటిల్ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ నేటినుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్లుక్ పోస్టర్ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్లుక్ పోస్టర్ వెంకటేశ్ సింపుల్ లుక్లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్ను అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

సంజు శాంసన్ నాకు పెద్దన్నలాంటోడు:జితేశ్ శర్మ

మరి కొన్ని నెలల్లోనే టీ20 వరల్డ్కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం సంజుశాంసన్, జితేశ్ శర్మ మధ్య తీవ్రమైన పోటీ ఉంది. కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20 మ్యాచ్లో సెలక్టర్లు జితేశ్ శర్మ వైపే మొగ్గు చూపారు. దీంతో సంజుశాంసన్ తుది జట్టులో స్థానం సంపాదించుకోలేకపోయాడు. ఈ మ్యాచ్లో జితేశ్ శర్మ 10 పరుగులతో (5 బంతుల్లో, 1 ఫోర్) నాటౌట్గా నిలిచాడు. మొదటి టీ20లో టీమ్ ఇండియా ఒకనొక దశలో 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయినప్పటికీ హార్దిక్ పాండ్య 59బీ 28 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్సు) ధనాధన్ బ్యాటింగ్, తిలక్ వర్మ (26బీ 32 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (23బీ 21 బంతుల్లో, 2 సిక్సు) సమయోచిత ఇన్నింగ్స్ భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేయగలిగింది. టీమ్ ఇండియా బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్లో భారత జట్టు 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం జితేశ్ శర్మ.. తనకు, సంజుశాంసన్ మధ్య ఉన్న అనుబంధాన్ని గురించి మాట్లాడాడు. 'అతడు జట్టులో ఉన్నందుకు ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే సంజు శాంసన్ నాకు పెద్దన్నలాంటోడు. ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడు, మనలో దాగున్న ప్రతిభ బయటకు వస్తుంది. ఇది జట్టుకు కూడా ఎంతో మంచిది. సంజుశాంసన్ అద్భుతమైన ఆటగాడు. మేమిద్దరం టీమిండియా తరపున ఆడుతున్నాం. మేం సోదరుల్లాంటివారం. అతడు నాకు చాలా సాయం చేశాడు' అని జితేశ్ శర్మ అన్నాడు. సంజుశాంసన్ 2024లో టీ20 ఫార్మాట్లో మూడు సెంచరీలు చేశాడు. కానీ.. శుభ్మన్ గిల్ వైస్కెప్టెన్గా నియమితుడయ్యాక అతడికి టాస్ఆర్డర్లో చోటు దక్కడం లేదు. అప్పటినుంచి సంజుశాంసన్ మిడిలార్డర్, లోయరార్డర్లో బ్యాటింగ్కు వస్తున్నాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో ఏకంగా జట్టులో స్థానమే కోల్పోయాడు.

ఎండలో తిరగడం వల్ల స్కిన్ నల్లగా మారిందా, కాస్ట్లీ క్రీమ్స్ బదులు కొన్ని పదార్థాలు రాస్తే నలుపు తగ్గి తెల్లగా మారతారు

అందం

ఎండలు పెరిగాయి. ఈ టైమ్లో స్కిన్ ట్యాన్ పెరుగుతుంది. ఈ సమస్యని దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

ట్యాన్ అనేది పెద్ద సమస్యే. దీని వల్ల స్కిన్ పాడవుతుంది. స్కిన్పై నల్లని మచ్చలు వస్తాయి. యూవి కిరణాల వల్ల సన్ బర్న్ ఇతర సమస్యలతో పాటు కొన్ని సార్లు స్కిన్ క్యాన్సర్ కూడా వస్తుంది. ఎండలో ఎక్కువగా ఉండడం వల్ల సూర్యుడి నుంచి వచ్చే కిరణాలు స్కిన్ని డ్యామేజ్ చేస్తాయి. దీంతో స్కిన్ బ్రౌన్, రెడ్ కలర్లోకి మారుతుంది. అయితే, సమస్యని తగ్గించేందుకు చాలా మంది ఎక్స్పెన్సివ్ ప్రోడక్ట్స్ వాడుతుంటారు. అలా కాకుండా ఇంట్లోనే కొన్ని చిట్కాలు సమస్యని తగ్గించి చర్మం మెరిసేలా చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

టమాట రసం

టమాటల్లో లైకోపీన్ ఉంటుంది. ఇది స్కిన్ పిగ్మంటేషన్ని దూరం చేస్తుంది. ఎరుపు, నలుపు మచ్చల్ని తగ్గిస్తుంది. దీనికోసం ఓ టమాట తీసుకుని దానిని మెత్తగా ప్యూరీలా చేయాలి. 20 నిమిషాల పాటు ఉంచి ఆ తర్వాత చల్లని నీటితో క్లీన్ చేయాలి. రెగ్యులర్గా చేస్తే ట్యాన్ తగ్గుతుంది.

బంగాళాదుంప రసం

బంగాళాదుంపల్లోని గుణాలు చర్మంపై ఉన్న నలుపుని బ్రైట్గా కనిపించేలా చేస్తాయి. దీనికోసం పచ్చి బంగాళాదుంపని జ్యూస్లా చేసి అందులో నుంచి జ్యూస్ తీయాలి. దీనిని సన్ ట్యాన్ ప్రదేశంలో రాసి అరగంట పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత చల్లని నీటితో క్లీన్ చేయాలి. వారానికి 2 సార్లు ఇలా చేస్తుంటే త్వరలోనే సమస్య తగ్గుతుంది.

పసుపు, పెరుగు



పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది స్కిన్ని ఎక్స్ఫోలియేట్ చేసి బ్రైట్గా కనిపించేలా చేస్తుంది. అదే విధంగా, పసుపు ఇరిటేషన్ని తగ్గించి స్కిన్ని సాఫ్ట్గా చేస్తుంది. దీనికోసం అర టీస్పూన్ పసుపులో రెండు టేబుల్ స్పూన్ల పసుపు వేసి బాగా కలపండి. దీనిని ట్యాన్ ఉన్న చోట రాయండి. 20 నిమిషాల పాటు ఉంచి తర్వాత చల్లని నీటితో కడగండి. దీనిని వారంలో 3 సార్లు ఫాలో అవ్వండి. రెగ్యులర్గా చేస్తే రిజల్ట్ ఉంటుంది.

దోస



దోసకాయలో కూలింగ్ ప్రాపర్టీస్ ఉన్నాయి. దీనిని వాడడం వల్ల స్కిన్ చల్లగా ఉంటుంది. దీంతో ఎండ వల్ల కమిలిన చర్మం మెరుగ్గా మారుతుంది. దీనికోసం దోసరసం తీసుకుని దానిని కాటన్తో కమిలిన చర్మంపై రాయండి. అదే విధంగా గుండ్రంగా కట్ చేసి స్కిన్కి రాయండి. అలానే 20 నిమిషాల పాటు ఉంచండి. తర్వాత క్లీన్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల ట్యాన్ తగ్గుతుంది. ముడతలు కూడా తగ్గుతాయి.

తేనె, నిమ్మరసం

తేనెలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉన్నాయి. దీనిని వాడడం వల్ల స్కిన్ డ్రైగా మారకుండా మాయిశ్చర్గా ఉంటుంది. అదే విధంగా నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ స్కిన్ని నేచురల్గానే లైటెన్ చేస్తుంది. దీనికోసం కొద్దిగా నిమ్మరసంలో తేనె కలిపాలి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని ఎండ తగిలే ప్రాంతంలో రాయండి. 20 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోండి. గోరువెచ్చని నీటితో క్లీన్ చేస్తే మంచిది. నాలుగు వారాల పాటు రెగ్యులర్గా రాస్తే రిజల్ట్ మీకే తెలుస్తుంది.

అలోవెరా

అలోవెరాలో ట్యాన్ని తగ్గించే గుణాలు ఉన్నాయి. అందుకోసమే చాలా మంది స్కిన్ ప్రాబ్లమ్స్ని దూరం చేసేందుకు అలోవెరా జెల్ని వాడతారు. దీనికోసం అలోవెరా జెల్ని ముఖానికి రాయాలి. అదే విధంగా, ఎక్కడైతే స్కిన్ ఎక్స్పోజ్ అవుతుందో, ట్యాన్ పేరుకుపోయిందో అక్కడ మొత్తం రాయాలి. నైట్ మొత్తం అలానే ఉంచి తర్వాత ఉదయాన్నే క్లీన్ చేయాలి. వారం రెగ్యులర్గా చేస్తే రిజల్ట్ మీకే కనిపిస్తుంది.

గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.